క్లుప్తంగా

వైభవంగా మల్లేశ్వరుని కల్యాణోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో స్వామివారి కల్యాణోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్ర సహిత కల్యాణ పుష్పయాగ మహోత్సవంలో భాగంగా సోమవారం ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నిత్య ఓపాసన, బలిహరణ, జగజ్యోతి ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని కల్యాణ వేదికపై స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రాచకొండ సుమంత్ శర్మ, రాచకొండ నాగరాజు శర్మలు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరు సురేష్‌బాబు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థినీ విద్యార్థులు గ్రాడ్యుయేట్ దుస్తులు ధరించి, స్కూల్ యాజమాన్యం అందించిన సర్టిఫికెట్లను పట్టుకుని హుషారుగా కేరింతలు కొట్టారు. వారిని చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రకృతిని పరిరక్షించటం అందరి బాధ్యత అని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పీఎస్‌సీఎంఆర్, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ, పలు అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భూమిని కాపాడుకోవటం ద్వారా సంతోషకరమైన ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలమన్నారు. మానవ జీవన విధానంలో ప్లాస్టిక్ వాడకం అధికమైందని చెప్పారు. అలాగే సుఖవంతమైన, విలాస జీవనానికి అలవాటు పడిన ప్రజలు ఆయా వస్తువుల ద్వారా అనేక వ్యర్థాలు, వాయువులను విడుదల చేయటం భూమికి చాలా ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయన్నారు. ఇంధనాల వినియోగం రోజురోజుకు పెరగటం వలన భవిష్యత్ తరాలు ఇబ్బందులు పడే ప్రమాదముందన్నారు. వీటిపై సమాజాన్ని జాగృతం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి.నరేష్, బి.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ ఏ.రమాదేవి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడ పోటీల్లోనూ రాణించాలని విజయవాడ నార్త్ మండల విద్యాశాఖాధికారి ఎ.వెంకటరత్నం సూచించారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్ ఎలిమెంటరీ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఆటల పోటీల్లో విజేతలకు సోమవారం ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి స్కూల్‌కి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం వి.ప్రమీలారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మరకత శివలింగ వాయు ప్రతిష్ఠా మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం మరకత శివలింగ వాయు ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు గోపూజతో మహోత్సవాలు ఆరంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలతో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు ఆలయ ప్రదక్షిణ, అదిష్టాన దేవతల అనుజ్ఞ, శ్రీ మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన, దీక్షావస్త్రధారణ, కలశస్థాపనలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు సాయంకాల మండప పూజలు, విగ్రహాలకు జలాధివాసం జరిగింది. కార్యక్రమాలను ఆలయకమిటీ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

- దుర్గగుడి అభివృద్ధికి రూ.70 కోట్ల నిధులు
- మరో రూ.216 కోట్లతో చురుగ్గా అభివృద్ధి పనులు
- టీడీపీ హయాంలో భక్తులకు నిలువ నీడ లేదు
- బీజేపీ అభ్యర్థి సుజనా తీరుపై సర్వత్రా విమర్శలు



దుర్గ గుడిలో శివాలయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): టీడీపీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఆలయాల అభివృద్ధి గురించి ఆలోచన చేయకపోగా.. జరుగుతున్న విధ్వంసాన్ని కళ్లు అప్పగించి చూశాడు... తీరా ఇప్పుడు అందలం ఎక్కిస్తే కొత్తగా ఏదో చేస్తాడట.. వైఎస్సార్ సీపీ హయాంలో రూ.కోట్లాది రూపాయల జరుగుతున్న అభివృద్ధి కాకుండా తానేదో చేస్తానని చెబుతున్నాడు.. ఏం చేస్తాడో కూడా ఖచ్చితమైన హామీ ఇవ్వలేని ఆయన మాటలకు జనం నవ్వుకుంటున్నారు. ప్రస్తుతం పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి పరిస్థితి అంతా అయోమయంగా మారింది. నగరంలో ఆలయాలను కూల్చివేసింది తమ ప్రభుత్వమేననే విషయాన్ని మరిచారు. తాజాగా సుజనా పశ్చిమన ఉన్న ఆలయాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మికతను పెంచేందుకు కృషి చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీలతో ఉదరగొట్టడం చూసిన జనాలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఉన్న తరుణంలో అమ్మవారి ఆలయం వైపు కన్నెతి చూడని సుజనా నేడు ఆలయాల అభివృద్ధి గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని పశ్చిమ ప్రజలు పేర్కొంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం, దాని మిత్ర పక్షం బీజేపీ ఆలయాల అభివృద్ధికి ఏనాడు రూపాయి ఇచ్చింది లేదు. టీడీపీ మిత్రపక్షంగా ఉన్న బీజేపీ దేవదాయ మంత్రి సైతం ఇదే తీరులో వ్యవహించడం అప్పట్లో విమర్శలకు దారి తీసింది. 2016లో కృష్ణా పుష్కరాల పేరిట నదీ తీరం వెంట ఉన్న 16 ఆలయాలను కూల్చివేసిన తరుణంలో రాజ్యసభ సభ్యుడుగా ఉన్న సుజనా చౌదరి ఆలయాల కూల్చివేయడాన్ని ఎందుకు అడ్డు చెప్పలేకపోయారో చెప్పాలని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు అవే రెండు పార్టీలు మరో మారు భక్తులను మోసం చేసేందుకు గతంలో జరిగినవన్నీ కప్పి పుచ్చేందుకు జనం మధ్యకు వస్తున్నారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం దుర్గగుడి పరిసరాల్లో కోట్లాది రూపాయల విలువ చేసే భవనాలను కూల్చివేసిన సంగతి సుజనా మర్చిపోయినా అమ్మవారి భక్తులు మర్చిపోలేకపోతున్నారు. ప్రస్తుతం బీజేపీ అభ్యర్థిగా ఉన్న సుజనా చౌదరి గెలుపు కోసం అష్టకష్టాలు పడుతున్న తెలుగు తమ్ముళ్లు... భక్తుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేయకపోగా, దేవస్థానానికి వచ్చే ఆదాయానికి సైతం గండికొట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు నిలువ నీడ లేకుండా చేయడమే కాకుండా భక్తుల వసతి కోసం కేటాయించిన భవనాలను ఆలయ అధికారుల కార్యాలయాలుగా మార్చి దేవస్థాన ఆదాయానికి గండి కొట్టారు. టీడీపీ ప్రభుత్వం కూల్చివేసిన ఆలయాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి పునర్నిర్మించడంతో పాటు వాటిని ప్రారంభించి నిత్య పూజలు జరిగేలా చర్యలు తీసుకుంది. ఆలయానికి దూరంగా ఉన్న అధికారుల కార్యాలయాలను తిరిగి మహా మండపంలోని నాల్గో అంతస్తుకు చేర్చింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే....

రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు


2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దుర్గగుడి అభివృద్ధికి విశేష కృషి చేసింది. దేవదాయ శాఖ మంత్రిగా వెలంపల్లి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. 2020 దసరా ఉత్సవాల సమయంలో ఆలయ ప్రాంగణంలో మట్టి చరియలు విరిగి పడటంతో ఆలయాభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా రూ.70 కోట్ల ప్రభుత్వ నిధులను కేటాయించారు. ఆ నిధులతో కొండపై నుంచి రాళ్లు జారిపడకుండా రాక్ బోల్టింగ్ పనులు, ఆలయంలో అత్యాధునికమైన విద్యుత్ వ్యవస్థ, మల్లేశ్వరాలయం, అన్నదానం, ప్రసాదాల పోటు వంటి పనులను చేపట్టారు.

కార్యరూపం దాల్చిన దుర్గగుడి మాస్టర్ ప్లాన్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాకుండా రూ.216 కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఎంతో కాలంగా కాగితాలపై పరిమితమైన మాస్టర్ ప్లాన్ కార్యరూపంలోకి తీసుకురావడమే కాకుండా అందులో పొందుపరిచిన పనులను గతేడాది డిసెంబర్‌లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు మాస్టర్ ప్లాన్‌లో మరి కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. కనకదుర్గనగర్ నుంచి వెలివేటెడ్ క్యూలైన్లు, ఆలయ ప్రాంగణంలో పూజా మందిరాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రానున్న దసరా నాటికి ఆయా భవనాల నిర్మాణం ఓ రూపానికి వచ్చేలా పనులు వేగంగా జరుగుతున్నాయి. మరో వైపున కనకదుర్గానగర్ వద్ద అమ్మవారి దేవాలయ ఆర్చి నిర్మాణం, మల్టీ లెవల్ కారు పార్కింగ్ భవన నిర్మాణం మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు.

దాతలకు తగిన ప్రాధాన్యం...

ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయాభివృద్ధిలో దాతలను భాగస్వామ్యం చేస్తూ ప్రభుత్వం ముందుకు నడిచింది. ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్న ప్రతి భక్తులు మల్లేశ్వర స్వామి వారి ఆలయాన్ని దర్శించుకుంటారు. అంతటి విశిష్టత ఉన్న మల్లేశ్వరాలయ అభివృద్ధి గురించి గత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయి. వైఎస్సార్ సీపీ హయాంలో మల్లేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ పనులను దాతల సహకారంతో చేపట్టింది. అనంతరం సీఎం దుర్గగుడి అభివృద్ధికి కేటాయించిన నిధుల నుంచి స్వామి వారి ఆలయ నిర్మాణం చేపట్టారు. తాజాగా అమ్మవారి ఆలయం సమీపంలో రూ.5 కోట్ల వ్యయంతో దాతలు యాగశాల నిర్మాణం చేపట్టారు. దీనికి అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందించాలని దేవస్థాన అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో రెండు నెలల కాలంలోనే యాగశాల ఒక రూపానికి రావడంతో పాటు ఈ నెల 26వ తేదీన ప్రారంభోత్సవానికి సైతం సిద్ధమవుతుంది.



దుర్గ గుడిలో నిర్మిస్తున్న యాగశాల



ఆలయ ప్రాంగణంలో జరిగిన అభివృద్ధి

అట్టహాసంగా ఎంపీ కేశినేని నాని నామినేషన్



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ కేశినేని నాని, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థులు

- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు
- చంద్రబాబు పెద్ద మోసకారి, అమరావతి బడా స్కామ్

విజయవాడస్పోర్ట్స్/వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) నామినేషన్ సోమవారం అట్టహాసంగా జరిగింది. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా హాజరుకావడంతో నామినేషన్ పర్వం కోలాహలంగా సాగింది. విజయవాడ వెస్ట్, తిరువూరు, జగ్గయ్యపేట, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థులు షేక్ ఆసిఫ్, నల్లగట్ల స్వామిదాస్, సామినేని ఉదయభాను, సర్నాల తిరుపతిరావుయాదవ్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మితో పాటు కేశినేని నాని భార్య పావని, కుమార్తెలు శ్వేత, హేమ, అల్లుళ్లు పృథ్వీ, రఘు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఉత్సాహంగా ర్యాలీ..

ఉదయమే.. కేశినేని నాని కుటుంబ సభ్యులతో కలిసి పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంద్రకీలాద్రి నుంచి నిర్వహించిన ప్రత్యేక ర్యాలీలో వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కెనాల్ రోడ్డు, తుమ్మలపల్లి కళాక్షేత్రం, పాత కంట్రోల్ రూం, ఏలూరు రోడ్డు, మ్యూజియం రోడ్డు మీదుగా బందరు రోడ్డులోని కలెక్టరేట్‌కు ఈ ర్యాలీ చేరుకుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ ర్యాలీ మధ్యాహ్నం 1.15 గంటల వరకు కొనసాగింది. దారి పొడవునా అభిమానులు గజమాలలు ఏర్పాటు చేసి ఘనంగా స్వాగతం పలికారు. హిందూ, క్రిస్టియన్, ముస్లిం, సిక్కు మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీస్సులందించారు. పలువురు మహిళా కార్యకర్తలు హారతులు పట్టారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి కేశినేని నాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీగా ర్యాలీలో పాల్గొనటంతో సుమారు రెండు కిలోమీటర్ల ర్యాలీ మూడు గంటల పాటు కొనసాగింది. ర్యాలీ కారణంగా ట్రాఫిక్ స్తంభించకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు

ర్యాలీలో ఎ.కొండూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ ముందు బిందెలతో సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఎంపీగా కేశినేని నాని విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని ఆశీర్వదించారు. గిరిజన వేషధారణలో తలపై బిందెలతో లయబద్ధంగా నృత్యం చేసుకుంటూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి నాగేంద్రపుణ్యశీల, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్ తదితరులతో పాటు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన పలువురు నాయకులు పాల్గొన్నారు.



హారతులు ఇస్తున్న మహిళలు



నృత్యాలు చేస్తున్న గిరిజనులు

ప్రజా ప్రయోజన పాలన

58 నెలల వైఎస్సార్ సీపీ పాలనలో సీఎం జగన్ ప్రజలకు ఏం కావాలో.. అదే అందించారని కేశినేని నాని అన్నారు. నామినేషన్ పర్వం ముగిసిన అనంతరం కలెక్టర్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రమంతటా గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజల చెంతలు తీసుకొచ్చామన్నారు. వలంటీరు వ్యవస్థతో ప్రజలకు మేలైన సేవలు అందించామని చెప్పారు. గ్రామ, పట్టణ, నగరాల్లో ప్రతి రెండు వేల మందికి ఒక క్లినిక్‌ను ఏర్పాటు చేసి వైద్య నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి వైద్య రంగం అభివృద్ధికి తోడ్పాటు అందించామని తెలిపారు. వేల కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ బడుల రూపు రేఖుల మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. 2014లోనూ ఇదే మాదిరిగా జనసేన, బీజేపీతో కలిసి చంద్రబాబు పోటీ చేశారని, 650 హామీలను ఇచ్చి ప్రజలను నిలువునా ముంచాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. చంద్రబాబు విశ్వసనీయత కోల్పోయాడని, విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కార్పొరేటర్‌గా సైతం పోటీ చేసేందుకు అర్హత లేనివాడన్నారు. ఒక కార్పొరేటర్‌కు వచ్చిన ఓట్లు మాత్రమే టీడీపీ ఎంపీ అభ్యర్థికి పడతాయని ఎద్దేవా చేశారు. 2024 ఎన్నికల అనంతరం టీడీపీకి తాళం పడిదన్నారు. 2019 ఎన్నికల్లో నవరత్నాలతో పాటు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. అందుకే ఎంతో ధైర్యంతో మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటేయ్యమని సీఎం జగన్ జగన్ ప్రజలను అడుగుతున్నాడని తెలిపారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న రాకేష్ స్కూల్ విద్యార్థులు



విక్టరీ సింబల్ చూపుతున్న నెల్లూరు రవీంద్రభారతి విద్యార్థులు



బొడ్డేటి వన్సిక (566, డీఎస్‌ఎంసీ హైస్కూల్)



వి.మహాలక్ష్మి (561, డీఎస్‌ఎంసీ హైస్కూల్)



డీ ఛరిష్మా రాణి (559, డీఎస్‌ఎంసీ హైస్కూల్)



వాకాడ దేవి (560, జీఎస్‌ఆర్‌ఎంసీ హైస్కూల్)



వాడపల్లి విజయలక్ష్మి (560, జీఎస్‌ఆర్‌ఎంసీ హైస్కూల్)

భవానీపురం(విజయవాడపశ్చిమ): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నగరపాలకసంస్థ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అధిక సంఖ్యలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో పాఠశాలల రూపురేఖలను మార్చిన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన మార్కులు వచ్చేలా కృషి చేసిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు సోమవారం వెలువడిన సందర్భంగా పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించటంతో ఆయా పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది. బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్‌లో మొత్తం 111 మంది హాజరుకాగా 80 శాతం ఉత్తీర్ణులయ్యారు. వారిలో బొడ్డేటి వన్సిక 566, వేమవరపు మహాలక్ష్మి 561, దిగల ఛరిష్మా రాణి 559 మార్కులు సాధించారు. 11 మంది 500కు పైగా మార్కులు సాధించారు. విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్‌ఆర్‌ఎంసీహెచ్ స్కూల్ విద్యార్థులు 74 మంది హాజరుకాగా 80 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో వాకాడ దేవి 560, వాడపల్లి విజయలక్ష్మి 560, బండి నాగ మోహన్ కుమార్ 550, ఉప్పాడ రూప 543 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 9 మంది 500కుపైగా మార్కులు సాధించారు.

విద్యార్థులకు అభినందనలు

భవానీపురం నెల్లూరు రవీంద్రభారతి స్కూల్‌లో 24 మంది హాజరుకాగా 23 మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులను స్కూల్ జోనల్ ఇన్‌చార్జ్ శివారెడ్డి, ఏజీఎం కేశవరాజు, డీన్ జీ మీనాక్షి శైలజ, ప్రిన్సిపాల్ రాధ, ఇన్‌చార్జ్ రాఘవులు అభినందించారు. విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్ నుంచి 49 మంది విద్యార్థులు హాజరుకాగా 47 మంది ఉత్తీర్ణులై 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. షేక్ జారా తబసుం 551, ధారావతు లిఖిత్ సాయి కిరణ్ 549, రంగాల హరిప్రియ 544 మార్కులు సాధించారు. 12 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు పొందారు. వారిని స్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు అభినందించారు. భవానీపురంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారిలో జంపా విష్ణుప్రియ 592, ముప్పల దుర్గా నాగ శ్రీవైష్ణవి 590, సంపాతి జయశ్రీ 588, పండుగల భవానీ 588, బత్తుల రామ్‌శరణ్ 587, మహమ్మద్ రుఖయ్య ఖనమ్ 587 మార్కులు సాధించారు. 77 మంది విద్యార్థులు 500పైన మార్కులు సాధించారు. విద్యార్థులను పాఠశాల ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ, ఆర్‌ఐ రామారావు, ప్రిన్సిపాల్ సత్యచిత్ర, కో ఆర్డినేటర్ చక్రధర్ ప్రసాద్, డీన్ రంగారావు అభినందించారు.

రాకేష్‌లో వంద శాతం ఉత్తీర్ణత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాకేష్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని స్కూల్ డైరెక్టర్ ఎన్వీ.రావు పేర్కొన్నారు. స్కూల్ ఆవరణలో వేడుకలను నిర్వహించారు. స్కూల్‌కు చెందిన వై.భవ్య అను 584 మార్కులు, అబ్దుల్ ఖదీమ్ 578 మార్కులు, టి.సత్య శిరీష 549 మార్కులు సాధించారన్నారు. పరీక్షలకు హాజరైన వారిలో 13 మందికి 500కి పైగా మార్కులు సాధించారని, పేద వర్గాలకు చెందిన విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

99.5 శాతం ఉత్తీర్ణతతో శ్రీగౌతమ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పదో తరగతి పరీక్ష ఫలితాలలో చిట్టినగర్ శ్రీగౌతమ్ 99.5 ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ ఎన్.సూర్యారావు పేర్కొన్నారు. విద్యార్థులతో సోమవారం వేడుకలను నిర్వహించారు. 584 మార్కులు సాధించిన గీతాంజలి స్కూల్ టాపర్‌గా నిలవగా, తేజాకుమార్, దీపిక, నిఖిత, ప్రవల్లిక, హర్షలు తదుపరి స్థానాలను కైవసం చేసుకున్నారన్నారు. సబ్జెక్టుల వారీగా నూరు శాతం సాధించిన వారితో పాటు ప్రథమ శ్రేణిలో 158 మంది, ద్వితీయ శ్రేణిలో 30 మంది, తృతీయ శ్రేణిలో 10 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అనంతరం స్కూల్ ఆవరణలో బాణసంచా కాల్చి విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులసీ, వైస్ ప్రిన్సిపల్ శ్రీరామ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలల్లో మెరిసిన విద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లోని 29 మున్సిపల్ స్కూల్ నుంచి మొత్తం 2,621 మంది విద్యార్థులు హాజరవ్వగా అందులో 2,121(80 శాతం)మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పటమట వించిపేటలోని ఎస్‌ఎస్‌ఎంసీ బాలికల ఉర్దూ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఐదు పాఠశాలల్లో 90కు పైగా ఉత్తీర్ణత సాధించారు. పది పాఠశాలల్లో 80, 11 పాఠశాలల్లో 70, రెండు పాఠశాలల్లో 60, ఒక పాఠశాలలో 50 శాతాలకు పైగా ఉత్తీర్ణత సాధించారు.

నగదు విషయమై ఘర్షణ

పెనమలూరు: యనమలకుదురులో ఇద్దరు వ్యక్తుల మధ్య నగదు విషయమై తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీయడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన జి.శ్రీనివాసరెడ్డి అదే గ్రామానికి చెందిన మైలా శ్రీనివాసరావు గతంలో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. అయితే శ్రీనివాసరెడ్డి రూ.2.65 లక్షలు కారు కొనడానికి శ్రీనివాసరావుకు ఇచ్చాడు. వారి మధ్య విభేదాలు రావడంతో వ్యాపారంలో ఇరువురు విడిపోయారు. వీరిద్దరు యనమలకుదురు లాకుల వద్ద ఎదురుపడగా నగదు విషయమై ఘర్షణ పడి పరస్పరం దాడి చేసుకున్నారు. పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

ఏకగ్రీవంగా విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ కార్యవర్గం



అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా తాళ్లూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఆల్లూరి శ్రీధర్ రెడ్డి, మిక్కిలి యేషయ్య బాబు, నిక్కు రవికుమార్, సహాయ కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు, బోని సురేష్‌కుమార్, అక్కి సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా ఈశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షురాలు వెనిగళ్ల అమ్మాజీ అధ్యక్షతన అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దేవినేని కిషోర్‌కుమార్ నూతన కార్యవర్గం సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బడ్జెట్ పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తామని చెప్పారు.

రేపటి నుంచి ఆదిశంకరుల జయంతి ఉత్సవాలు

విజయవాడకల్చరల్: జగద్గురువులు ఆదిశంకరుల జయంతి ఉత్సవాలను శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో బుధవారం నుంచి 20 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు క్షేత్ర ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయంలో ప్రతి రోజూ పంచామృత అభిషేకం, అర్చన, అష్టోత్తర శతనామార్చన నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రస్తానత్రయ భాష్యం అంశంగా ప్రసంగిస్తారని తెలిపారు. భక్తులు పూజాది కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

25న స్వరఝరి వార్షికోత్సవం

విజయవాడకల్చరల్: స్వరఝరి సంగీత సేవా సంస్థ 36వ వార్షికోత్సవాన్ని 25వ తేదీ గురువారం సాయంత్రం దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత విద్వాంసుడు శ్రీమాన్ కొమాండూరి శేషాద్రికి చింతలపాటి రాజ్యలక్ష్మి స్మారక వార్షిక పురస్కారం, మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోహనరావుకు లయ ప్రవీణ పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. ఇందులో భాగంగా కొమాండూరి శేషాద్రి, అనంత శౌరిరాజన్, వెంకటకృష్ణల వాయిలీన త్రయం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.